

# హీరోయిజం

—జైరాజ్

అతని మాటకు విలువుంది.

కాకితో కబురంపితే అతగాడికి ఎక్కడైనా పదిరూపాయలు అవలీలగా పుడతాయి.

అంత పలుకుబడి, అంత పరపతి గలవాడు తిరుపతి.

పెద్ద చదువులంటే తూగలేక పదో తరగత్తో సరి పెట్టుకున్న తిరుపతి ఉద్యోగమో అంటూ ఉరుకు పెట్టాడు.

ఉరుకులు-పరుగులెట్టి, ఉద్యోగాన్వేషణకంటే పారిజాతాపహరణం సులువేమో ననుకున్నాడు.

ఎందుకంటే కొండొక చోట ఎస్టాబ్లిష్‌మెంట్ గుమాస్తా .నోట్ రాశాడంటే, దానికి తిరుగులేదని

ఎవరో చెప్పగా వారికో వందిచ్చు కుని, చెప్పిన వాడికో పాతికిచ్చు కుని, కడపట ఉసూరుమని నోరు తెరిచాడు తిరుపతి.

మరొకచోట, 'మేనేజరు గారి మాటంటే ఏవిటనుకున్నావ్? మాటంటే మాటే' అన్న మీదట, మాటప్రకారం మూడొందలు సమర్పించుకుని, వ్యవహారం బెడిసి కొట్టాక కళ్ళనీళ్ళు పెట్టుకోవడం మినహా మరేమనడానికి అవకాశమే లేకపోయింది తిరుపతికి.

ఇలాంటనుభవాలు ఇంకా వున్నాయి కాని, అన్నీ ఏకరువు పెట్టకుండా అనుభవ పూర్వకంగా తిరుపతి గ్రహించిన విషయం చెప్పేస్తే చాలు.

అవసరంలోగాని, ఆపదలో గాని వున్నవాడి దగ్గర నుండి అవకాశం దొరికినవాడు ఇంతో అంతో గుంజుకోవచ్చు. అంతేగాదు-గుంజుకునే ప్రతివాడూ చేస్తానన్న పనికి నూటికి తొంభై పాళ్ళు గేరంటీ ఇచ్చి, చిన్న క్లాజొకటి వొదిలి, ఆ మిగిలిన పదిశాతం ఈ క్లాజుది సుమా-అనడం రివాజని కూడా గ్రహించాడు.

ఉదాహరణకి, ఆ ఎస్టాబ్లిష్మెంట్ క్లర్కు నూర్రూపాయలునవ్వుతూ అందుకొని అన్న మాటలు తిరుపతికి బాగా గుర్తు. 'నా నోట్కైతే తిరుగులేదుగాని, నీ నోటు మాటే చిన్న సందేహమోయ్! ఎవడైనా నేరుగా ఆఫీసర్నే ఎప్రోచ్చయి ఇలాంటివే నాలుగైదు నోట్లందించాడంటే మాత్రం అది నీ దురదృష్టం' అన్నాడు.

తిరుపతి ఉసూరుమని నోరు తెరచిన్నాడు- 'నేనన్లేదటోయ్! వాడెవడో వాడు ఐదొందలిచ్చాడట మరి! నేను ముందే చెప్పలా!' అన్నాడు.

ఆ మేనేజరేమన్నాడు?- 'నా మాట కాదనడానికి వీల్లేదుగాని, ఏదైనా పొలిటికల్ ప్రెజర్-అదే నోయ్- రికమెండేషను గట్రా వుంటే మాత్రం నీ బేడ్ లక్' అన్నాడు.

తిరుపతి కళ్ళనీళ్ళు పెట్టుకున్ననాడు, 'నెక్స్ట్ టైమ్ బెటర్ లక్కోయ్! అవతలివాడు మినిష్టరుగారి కేండిడేటట మరి' అనేశాడు.

ఇంతకీ చెప్పొచ్చిందేవిటీ అంటే-అంత పలుకుబడీ, అంత పరపతీ తిరుపతి ఎలా సంపాదించగలిగాడన్న దానికి ఇది నాందీ ప్రస్తావన.

అవసరంలోనో ఆపదలోనో వున్న వాడితోనూ, అవసరమూ ఆపదా గడిపేవాడితోనూ సన్నిహిత

సంబంధ బాంధవ్యాలు నెలకొల్పు కొంటే జీవించడం బహు తేలి కేమో అనుకున్న తిరుపతి, ఫస్ట్ ప్రైల్‌గా, 'ఫలాని ఆఫీసులో ఖాళీ వచ్చిందట!' అని ఎగిరి గంతేసి దరఖాస్తు పెట్టుకొంటున్న ఒకానొక ఉద్యోగాన్వేషి కంటబడగానే, ఆ అవకాశం జారవిడవకుండా, 'అదృష్టవంతుడివోయ్! నా కంటే ఏజ్ బారై పోయింది. లేకుంటే నీ దాకా రానిద్దునా ఆ పోస్టు?' అని లౌక్యంగా ఓ మాట జారవిడిచే సరికి, అతగాడు ఎంతో ఇదై పోయి, 'ఇతగాడి చేతిలో ఎంతో కొంత లేకపోతే అంత మాటంటాడా?' అనుకొని, 'బాబ్బాబు! నాకేదైనా సాయం చేద్దురూ?' అని ప్రాధేయపడగా, అప్లికేషన్ ఫారం తిరుపతే ఫిలప్ చేసిపెట్టి, 'దీన్లో ఏముందోయ్! అంతా ఆ ఎస్టాబ్లిష్ మెంటు క్లార్కు వ్రాసే నోట్‌లో వుంది మహత్తు. ఆయన గారు నాకు చిరపరిచయుడ్లే' అనేసి, మార్గాంతరం వివరించి అతణ్ణి ఒప్పించి, వందిప్పించి, తన పాతిక తను గుంజుకొని, ఎస్టాబ్లిష్ క్లర్కు క్లాజుకు వంతపాడి, ఉద్యోగాన్వేషితో, 'విష్‌యు గుడ్‌లక్' అనేసి వ్యవహారం చేతులు కడుక్కోగలిగాడు తిరుపతి.

అలాగే పరిచయుడైన మేనేజరు గారి వద్దకో కేండిడేటును పంపించి, తానొక వంద గుంజుకోగలిగాడు- కేండిడేట్‌ను వాడి ఖర్మానికి వాణ్ణొదిలి పెడుతూ.

ఇలా అనుభవమున్న అనేకాఫీసుల్లో కీలక స్థానాల్లో వున్న వారిని ఎరిగున్న వాడైనందున, ఆఫీసుకొక కేండిడేటును పంపి సొమ్ము చేసుకోగలిగాడు.

ఒకచోటా, అరచోటా అదృష్టం కొద్దీ పని జరిగినందున తిరుపతి ఇందుకు పనికి వస్తాడనే పలుకుబడి కూడా కొద్దిగా సంపాదించగలిగాడు.

ఇలా అర్జనకు అర్జనా, పలుకుబడికి పలుకుబడీ సంపాదించడం నేర్చుకున్న తిరుపతి, 'ఇంకా పైకెదగాలంటే పద్ధతుల్ని సూక్ష్మీకరిస్తేనో?' అనుకున్నాడు.

అనుకోగానే అతడి మస్తిష్కంలో తళుక్కున ఒక ఆలోచన మెరసింది.

మెరవగానే ఓ కాగితం, కలం అందుకొని వ్రాత మార్చి ఓ ఆకాశ రామన్న పిటీషను వొదిలాడు-

'ఫలాని మేనేజరు ఫలాని కేండిడేటు దగ్గర మూడొందలు మేసి, చివరకు చేస్తానన్న పని చెయ్యలేదు సరిగదా, నా మూడొందల మాటేవిటంటే బోడిచెయ్యి చూపించాడు.

ఇందుకు సాక్ష్యం ఫలాని తిరుపతి' అని ఆ పిటీషను సారాంశం.

'కొంపలంటుకు పోయాయండీ తిరుపతిగారూ!' అంటూ మేనేజరు తన వద్ద కొచ్చి దాసోహం అంటే, ఏమీ ఎరగని వెల్లుల్లిలా, 'ఏవిటండీ- అంత కొంపల మీదకొచ్చిన వ్యవహార మేమిటి?' అని నింపాదిగా అడిగి, మేనేజరు సంగతి చెప్పగా,' ఎవరో దగుల్బాజీ వెధవ పిటీషను రాసి పంపినంత మాత్రాన నేను సాక్ష్యం చెబుతానటండీ! ఆ పాటి నీతి నియమం లేని వాణ్ణా? మీరేం భయపడకండ'ని హామీ ఇచ్చాడు.

'మీరు సరేనండి బాబూ- పెద్ద మనుషులు! మరి కేండిడేటు మాటో?' అని మేనేజరు నీళ్ళు నమిలితే ...

'అప్పచీనాది. నాకొదిలెయ్యండి. కాకపోతే వాడికింకా ఉద్యోగం దొరకలేదు. ఏదో- ఇబ్బందుల్లో వున్నాడు. పుచ్చుకున్న దాంట్లో సగం ఇచ్చెయ్యండి చాలు-మిగతా సంగతి నాకొదిలెయ్యండి' అన్నాడు తిరుపతి.

'బాబ్బాబు- మహాప్రసాదం!' అంటూ మేనేజరు అక్కడికక్కడే నూటయాభై కక్కేసి, 'భార మంతామీదే' అన్నమీదట, 'అంతా నాదే'నని కేండిడేటు వద్దకెళ్ళి, 'ఎంతైనా అదృష్టవంతుడి వోయ్! ఇచ్చిన వాడికి తిరిగి రావడమంటూ ఎక్కడైనా వుందా?' అంటూ వంద చేతబెట్టి, ఇదయ్యా విషయం అని విషయం చెప్పి, 'దక్కిన కాడికి దక్కిందే దక్కుడు. ఎవడో కిట్టని వాడు పిటీషను పెట్టాడు గనక ఇదైనా దక్కింది. మనమైతే పెదతామా? రేపొద్దున్న ఎంక్వయిరీలో అలాంటిదేదీ లేదని చెప్పాలిసుమా! రేపొద్దున్న ఆ మేనేజరుతో నాకు బోల్డు పన్లుంటాయి. ఆ మాట కొస్తే మరో వేకెన్సీ ఏదయినా అదే ఆఫీసులో వాస్తే, ఈ మాటు కాణీ ఖర్చులేకుండా ఆ ఛాన్సు నీదే సుమా!' అంటూ నవ్వుతూ నచ్చజెప్పాడు.

కేండిడేటు పరమానందభరితుడై, వందా అందుకొని 'తిరుపతి నిజంగా దేవుడిలాంటివాడు సుమా' అనుకొని నమస్కరించి హామీ ఇచ్చాడు.

ఇలాంటి పద్ధతిద్వారా తిరుపతి మరికొంత పలుకుబడి, మరికొంత రాబడి సంపాదించగలిగాడు.

తిరుపతి మెదడు పదును దేరింది.

అజ్ఞాతంలో వుండి ఆపదలు సృష్టించి పరిష్కారం ముందే

ఊహించుకుంటే బ్రతుకుతెరువు మరింత సుళువనిపించింది.

షావుకారు రామయ్య గ్లాక్సో డబ్బాలు బ్లేక్‌లో అమ్ముతున్నాడని తెల్సియగానే,అందుకుసంబంధించిన అధికారికి చెప్పుచేసి ఓఆకాశరామన్న పిటీషను వొదిలిన . తిరుపతి— 'రామయ్యగారూ! కొంపలు మునిగాయి. గ్లాక్సో అట- మీ కొట్లో నట-స్టాకున్నాయట-బ్లేక్‌లో అమ్ముతున్నారట! కన్నుకుట్టిన వాడెవడో వొదిలాడు పిటీషను. ఆఫీసరు నాకు తెలిసినవాడు గాబట్టి, మా ఇద్దరిమధ్యా . వున్న చనువుకొద్దీ రహస్యంగా ఇదీ సంగతి అని చెప్పాడు. జాగ్రత్త పడండి. ఇవేళో రేపో మీ కొట్టుమీద దాడి జరగొచ్చు' అన్నాడు.

'అయ్యబాబోయ్!' అన్న శెట్టి గారితో, 'మీకేం ఫర్వాలేదు. ఆ స్టాకేదో నా ఇంటికి నడిపించండి' అని మార్గాంతరం చెప్పి, 'దేవుడి లాంటోడివయ్యా!' అనిపించుకొని, స్టాకు నడిపించి రామయ్య ఆపద గడిపాడు.

కొట్టు సోదా చేసిన ఆఫీసరు, 'ఫాల్సుపిటిషను' అని రాసుకెళ్ళాక ఆఫీసర్ని ఖుద్దున కలిసి, 'ఎవడో ఉప్పందించాడు సార్! రామయ్య కొట్లోనేంటి-స్టాకులేకపోవడమేంటి రెండ్రోజులాగి సర్ప్రైజ్ చెయ్యండి- అప్పుడు బయటపడుతుంది అసలు రంగు' అని చెవిలో ఊది, సర్ప్రైజ్ రెయిడ్‌సాధు రామయ్య్య'బేర్'మంటే, ఆపద్బాంధవుళ్ళా తిరుపతి అడ్డుపడి, ఆఫీసరుగారికి నచ్చజెప్పి కేసు లేకుండా చేసి కానుక ఇప్పించగలిగాడు.

. ఇలా బహు నేర్పుగా ప్రోబ్లమ్ తానే సృష్టిస్తూ, తానేపరిష్కరిస్తూ సంపాదించిన పలుకుబడి తిరుపతికి పరపతికూడా సంపాదించింది.

. తిరుపతితో పనిబడని .వాడు లేడు. తిరుపతితలదూర్చని విషయం లేదన్నట్టుగా తీర్చిదిద్దుకున్నాడు తిరుపతి తన జీవిత విధానం.

తిరుపతి యమ్మెల్యేగా నిలబడ్డాడంటే ఆశ్చర్యపోయిన నేను' గెలిచాడని తెలియగానే అభినందించడానికని వెళ్ళాను.

నా చిన్ననాటి స్నేహితుడు తిరుపతి- చచ్చుల్లిపాయలాంటి వాడు.

అలాటివాడు ఇంతటివాడెలా అవ్వగలిగాడా- .అని ఆశ్చర్యపోయిన నేను, "ఇంతటి వాడివెలా కాగలిగావురా తిరుపతీ?" అని అడక్కుండా వుండలేకపోయాను.

మా ఇద్దరి మధ్యావున్న ఆత్మీయత అలాంటిది..

ఏ అరమరికా లేకుండా అనేక విషయాలు చెప్పాడు తిరుపతి—:

"ప్రతి మనిషీ ఒక పాముల పుట్టరా కృష్ణా! పుట్ట అన్నాక పాములకు నెలవు. 'అదుగో పాము' అని ఎవడితోనో అనిపించి, 'ఏదీ? ఎక్కడా?' అంటూ కర్రొకటి చేతబట్టి, పెద్ద ఛారోలా నటిస్తూ, తడకమీదో నేలమీదో చప్పుడు చేస్తూ, పాముని దాటబెడితే మన కొచ్చే అపాయమూ లేదు— పాముకి ప్రాణభయమూ లేదు. 'కర్ర విరగా గూడదు— పాము చావాగూడదు' అన్న సామెతలో వున్న 'హీరో'యిజం రా — అంతే!" అన్నాడు తిరుపతి. *


